


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
గుంటూరు జిల్లా వార్తలు
ఆదివారం 26 అక్టోబరు 2025



ముంచుకొస్తోన్న.. మొంథా

- ఐఎండీ హెచ్చరికలు జారీ
- తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- తుపాను ప్రకటనతో రైతుల ఆందోళన
- అధికారుల అప్రమత్తం.. ముందస్తు చర్యలు

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారి మొంథా పేరుతో ముంచుకొస్తోంది. తుపాను ప్రభావంతో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతి భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. పల్నాడు జిల్లాపైనా ప్రభావం ఉండవచ్చని అధికారులు అప్రమత్తమయ్యారు. తుపాను ప్రభావంతో జిల్లాలో 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే తరుణంలో తుపానుతో నిండా మునిగిపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి, పత్తి వంటి పంటలు కోత దశకు వచ్చిన నేపథ్యంలో నాలుగు రోజులు వర్షాలపై వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలతో నష్టపోయామని.. ముంచుకొస్తోన్న మొంథా ముంచేస్తుందని వాపోతున్నారు. పంట ఏ దశలో ఉన్నప్పటికి తుపాను వలన అధిక శాతం వర్షపాతం నమోదైతే చేతి కొచ్చే దిగుబడులు నీటిపాలవుతా యని రైతులు ఆవేదన చెందు తున్నారు. భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. తపాను ప్రభావంతో 27 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు (మిగతా 6వ పేజీలో)


నీటిలో నానుతున్న పత్తి పంట



హార్బర్‌లో 1వ నెంబరు హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడుతున్న నేపథ్యంలో నిజాంపట్నం హార్బర్‌లో 1వ నెంబర్ ప్రమాదహెచ్చరికను ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈదురుగాలులు కూడా వీస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో వేట చేసే పరిస్థితి లేక మత్స్యకారులు బోట్లు జెట్టీలకే పరిమితమయ్యాయి.


తుపానుపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అన్సారియా

రేపటి నుంచి 29 వరకు
పాఠశాలలకు సెలవు

- కలెక్టరేట్‌లో 0863- 2234014 నంబరుతో కంట్రోల్ రూం
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు(తూర్పు), గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో భారీవర్షం, గాలులు వీచే అవకాశం ఉన్నందున సోమవారం నుంచి 29 వరకు మూడు రోజులు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపవద్దని సూచించారు. ప్రజలు, తుఫాను దృష్ట్యా ఇళ్లవద్దే ఉండాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ 0863 2234014 ఏర్పాటు చేశామన్నారు. డివిజన్, మండల స్థాయిలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. తుపాను ముందుస్తు సహాయక చర్యలపై జిల్లా, మండల, ప్రత్యేక అధికారులతో శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షించారు. అనంతరం మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ దృష్ట్యా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత తుపాన్ల కంటే మొంథా తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కూలేందుకు అవకాశం ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన బోట్లు ఇతర వాహనాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. మండలాలు, మున్సిపాలిటీల్లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా, సాధ్యమైనంత వరకు నష్టాలను తగ్గించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసు లు, డీఆర్వో ఖాజావలి, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్రబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



యూరియా బస్తా రూ. 450

- అధిక వర్షాలకు పొలాల్లో నిలిచిన నీరు
- పంటల సంరక్షణకు యూరియా వినియోగం
- ఒక్కసారిగా పెరిగిన డిమాండ్..
- సరఫరాలో జాప్యం.. అన్నదాతలకు శాపం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

అధిక వర్షాలతో పంటలు ఉరకెత్తుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. రైతులందరూ పంటలకు ఒకే సమయంలో యూరియా వాడాల్సిన పరిస్థితులు ఏర్పడటంతో డిమాండ్ పెరిగింది. దీనిని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా బస్తా రూ.420 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పెరిగిన డిమాండ్ కారణంగా సమస్యలు తెలెత్తుతున్నాయి. ప్రైవేట్ షాపులపై పర్యవేక్షణ కొరవడడంతోనే అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఎరువుల సరఫరాలో జరుగుతున్న జాప్యం రైతులకు శాపంగా పరిణమిస్తోంది.

ఆర్‌ఎస్కేలకు నిలిచిన సరఫరా

అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా (మిగతా 6వ పేజీలో)

నీటి సంఘాలకు.. జీఎస్టీ బాదుడు

వైసీపీ పాలనలో ఐదేళ్లు పాడుబెట్టిన సాగర్ కాలువలను కూటమి ప్రభుత్వం బాగు చేసింది. పూర్తి స్థాయిలో పనులు జరగడంతో చివరి భూములకు సైతం సాగునీరు సరఫరా జరుగుతోంది. నీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువుల మరమ్మతులు నిర్వహించారు. ఈ పనులకు జీఎస్టీ విధించారు. కాంట్రాక్టర్లు చేపట్టే పనులకు ఉన్న జీఎస్టీ విధానాన్ని నీటి సంఘాలకూ అమలు చేశారు. దీంతో చేపట్టిన మర్మమతుల పనులకు రూ.4.49 కోట్లు జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. దీంతో నీటి సంఘాలు గుడ్లు తేలేస్తున్నాయి. 12 శాతం జీఎస్టీని అమలు చేశారని.. దీనిని రద్దు చేయాలని నీటి సంఘాలు కోరుతున్నాయి. చేసిన పనులకు నేటి వరకు బిల్లులు చెల్లించలేదని సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు.

- కాల్వల మరమ్మతులకు 12 శాతం జీఎస్టీ
- బిల్లుల చెల్లింపులోనూ జాప్యం
- రూ.37.44 కోట్ల వ్యయంతో 801 పనులు
- జీఎస్టీ వసూలు రూ.4.49 కోట్లు


మైనర్ కాలువలో పూడికతీత (పాతచిత్రం)

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

సాగర్ కుడి కాలువ పరిధిలో అధ్వానంగా ఉన్న మేజర్, మైనర్, సబ్ మైనర్ కాలువల మరమ్మతులకు ప్రభుత్వం రూ.37.44 కోట్లు నిధులు విడుదల చేసింది. జలవనరుల శాఖ గుర్తించిన 801 అత్యవసర పనులను చేపట్టిన నీటి సంఘాలు పనులను పూర్తి చేశాయి. కాలువల్లో పూడికతీత, కంప చెట్ల తొలగింపు, కట్టల పటిష్టత, కట్టడాల పునరుద్ధరణ వంటి పనులు చేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని నాగార్జున సాగర్ లింగంగుంట్ల, ఒంగోలు సర్కిల్ పరిధిలో 801 అత్యవసర మరమ్మతులు పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో కాలువల మర్మత్తులు జరిగాయి.

బిల్లుల్లో జాప్యం.. జీఎస్టీ శాపం

నీటి సంఘాలు నిర్వహించిన మరమ్మతుల పనులకు జలవనరుల శాఖ అధికారులు బిల్లులు సిద్ధం చేశారు. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యం జరగుతోందని నీటి సంఘాలు చెబుతున్నాయి. మరమ్మతుల వ్యయం అంచనా ల్లోనే 12 శాతం జీఎస్టీ చెల్లించే విధంగా పొందు పరిచారు. ఈ విషయం తెలియక నీటి సంఘాలు పనులు పూర్తి చేశాయి. అంచనా వ్యయం మేరకు పూర్తిగా బిల్లులు చెల్లిస్తారని అవి భావించాయి.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

ఏళ్ల తరబడి కాలువలకు మరమ్మతులు చేయపోవడంతో.. కొన్ని నీటి సంఘాల పరిధిలో రైతులను భాగస్వాములను చేసి వ్యయం అంచనాకు మించి పనులు చేశారు. తీరా బిల్లుల్లో జీఎస్టీ చూపించడంతో తాము తీవ్రంతా నష్టపోతామని (మిగతా 6వ పేజీలో)

లక్ష్య సాధనలో అలసత్వం వద్దు

- అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనలో అలసత్వం వద్దని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వివిధ శాఖలపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష జరిగింది. తొలుత వైద్య ఆరోగ్యశాఖపై సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం సిజేరియన్ ప్రసవాలు చేస్తున్న ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయాలన్నారు. గర్భిణుల నమోదు మెరుగుపడాలన్నారు. ఏబీహెచ్‌ఏపై అవగాహన కల్పించాలని, ఇందుకు గ్రామ సచివాలయం సిబ్బందిని ఉపయోగించాలని సూచించారు. రక్త హీనత గలవారిపై పర్యవేక్షణ చేయాలన్నారు. డీఎంహెచ్‌వో విజయలక్ష్మి మాట్లాడుతూ ఏబీహెచ్‌ఏ ఐడీ నమోదులో గుంటూరు రాష్ట్రంలో మూడో స్థానంలో ఉందన్నారు. హై రిస్క్ గర్భిణులుగా 3,477 మందిని గుర్తించామని, వారికి తగిన వైద్యం అందిస్తున్నామన్నారు.

- నీటి పథకాల మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. స్లో శాండ్ ఫిల్టర్లు ఏర్పాటుకు ప్రాధాన్యం మేరకు గుర్తించి అంచనాలు సమర్పించాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కింద జిల్లాలో 313 పనులను చేపట్టినట్లు తెలిపారు.


భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

గుంటూరు రవీంద్రనగర్ శివాలయంలో ఉన్న నాగేంద్ర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



- ఈసీ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలి
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న జిల్లా యంత్రాంగం

263 పోలింగ్ కేంద్రాల్లో.. అదనంగా ఓటర్లు

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1200 ఓటర్ల కంటే అదనంగా ఉన్న పోలింగ్ స్టేషన్లను క్రమబద్ధీకరించే ప్రక్రియని అధికార యంత్రాంగం చేపట్టింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఏ పోలింగ్ బూత్‌లో అయితే ఓటర్ల సంఖ్య 1200 దాటిందో అక్కడ మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఆ మేరకు కొన్ని రోజుల నుంచి జాబితాలను తెప్పించి అధికారులు పరిశీలించి నివేదిక సిద్ధం చేశారు. ఈ ప్రకారం జిల్లాలో మొత్తం 1920 పోలింగ్ కేంద్రాలు ఉండగా 263 పోలింగ్ బూత్‌ల్లో అదనంగా ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. తాడికొండలో 245, మంగళగిరిలో 303, పొన్నూరులో 264, తెనాలిలో 273, ప్రత్తిపాడులో 288, గుంటూరు పశ్చిమలో 291, గుంటూరు తూర్పులో 256 పోలింగ్ స్టేషన్లను నోటిఫై చేశారు. అయితే వీటిల్లో 1 - 1000 మంది ఓటర్లున్న కేంద్రాలు 1157, 1001 - 1150 ఉన్నవి 379, 1151 - 1200 ఓటర్లు ఉన్నవి 121 ఉన్నాయి. 1201 నుంచి 1300 ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 140, 1301 నుంచి 1400 ఉన్నవి 87, 1401 నుంచి 1500 ఓటర్లున్నవి 36 ఉన్నాయి. 1200 ఓటర్లకు మించిన కేంద్రాల్లో ప్రక్రియ అర్ధరాత్రి వరకు కూడా కొనసాగుతుంది. అయితే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ రోజున సాయంత్రం 6 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ముగియాలి. కానీ పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా వందల సంఖ్యలో ఓటర్లు క్యూలో ఉంటున్నారు. తుది గణాంకాల విడుదలకి పోలింగ్ ముగిసిన 48 గంటల తర్వాత వరకు సమయం పడుతున్నది. వీటికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న 263 పోలింగ్ బూత్‌లను విభజించి ఓటర్ల సంఖ్య తగ్గేలా చేసేందుకు ప్రక్రియ చేపట్టింది.

స్పెషల్ ఇన్‌క్లూజివ్ రివిజన్‌కు ఏర్పాట్లు

ఏటా సంవత్సరం ఆఖరులో జరిగే స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) స్థానంలో ఈ ఏడాది నుంచి స్పెషల్ ఇన్‌క్లూజివ్ రివిజన్(ఎస్ఐఆర్) జరగనుంది. ఇందుకోసం అంతా సిద్ధం చేసుకోవాల్సిందిగా ఇటీవలే సీఈవో ఆదేశించారు. ఆ మేరకు అధికారులు ఇప్పటి వరకు నమోదైన ఓటర్ల గణాంకాలను విడుదల చేశారు. దాని ప్రకారం జిల్లా ఓటర్ల సంఖ్య 17 లక్షల 97 వేల 340కి చేరింది. ఇందులో పురుషులు 8,68,202, మహిళలు 9,28,977 మంది ఉన్నారు. గత ఏడాదితో పోల్చితే ఇప్పటివరకు 2,707 మంది ఓటర్లు పెరిగారు. ప్రతీ వెయ్యి మంది పురుషులకు 1070 మంది మహిళలు ఓటు హక్కు కలిగివున్నారు. అలానే జనాభాలో ప్రతీ వెయ్యి మందిలో 729 మంది ఓటుహక్కు పొందారు.

రద్దీ ప్రమాదాలను నియంత్రించాలి

● వార్ రూంని సందర్శించిన డీఆర్ఎం సుధేష్ణ సేన్



సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ ఆఫీసులో ఉన్న వార్ రూంని డీఆర్ఎం సుధేష్ణ సేన్ తొలి సారిగా శనివారం సందర్శించారు. ఏడీఆర్ఎం రమేష్‌కుమార్‌తో కలిసి వార్ రూంకి వెళ్లిన ఆమె అక్కడి కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రస్తుత పండగల సెలవుల రద్దీ నేపథ్యం లో రైల్వే స్టేషన్లకు అధిక సంఖ్యలో ప్రయాణికులు వచ్చే అవకాశం ఉన్నందున వార్ రూం నుంచి.. సిబ్బంది సీసీ టీవీల ద్వారా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు పంపుతున్న సూచనలు, ఆదేశాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది 24 గంటలూ సీసీ టీవీ స్ర్కీన్‌ల ముందుండి పరిశీలిస్తుండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రద్దీ కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరక్కూడదని స్పష్టం చేశారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న సీడీఈ డీన్ వి.వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎంకామ్, ఎంహెచ్‌ఆర్ఎం ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో సెమిస్టర్, ఎంఏ జర్నలిజం ప్రథమ, ద్వితీయ, నాలుగో సెమిస్టర్లు, ఎంఎల్ఐసీ ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను దూర విద్య సంచాలకులు ఆచార్య వీ వెంకటేశ్వర్లు శనివారం విడుదల చేశారు. విద్యార్థులు రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.960 చెల్లించాలని చెప్పారు. పరీక్ష ఫలితాలను anucde.info వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.


నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న పెనుమాక వాసులు

తాడేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి భక్తులు విశేషంగా విరాళాలు అందిస్తున్నారు. తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన కళ్లం శివారెడ్డి తన మనుమడు లోకోరెడ్డి సాయిరాణా ప్రతాప్‌రెడ్డి పేరుమీదుగా రూ.1,01,116లు, మనుమరాలు పోలిరెడ్డి మన్వితరెడ్డి పేరుమీదుగా మరో రూ.1,01,116 నిత్యాన్న ప్రసాదానికి శనివారం విరాళంగా సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ భక్తుల సేవా భావాన్ని ప్రశంసిస్తూ ఇలాంటి దాతృత్వం.. ఇతర భక్తులకు స్ఫూర్తిదాయకమన్నారు.

ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 84,494 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 11.3 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగు వకు 83,983 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూ ర్పు డెల్టా కాలువకు 511 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, పశ్చిమ డెల్టాకు, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

సాగర్ నీటి నిల్వ 305.62 టీఎంసీలు

విజయపురిసౌత్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 587.20 అడుగులు ఉంది. ఇది 305.62 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 2,878, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,232, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 34,204 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 34,204 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాలలో 1.0752 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండు యూనిట్ల ద్వారా శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0752 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లు 1.50 మీటర్లు, 1 గేట్‌ను మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 18,406 క్యూసెక్కులు,టేల్‌రేస్ చానల్ ద్వారా 8,683 క్యూసెక్కులు మొత్తంగా 27,089 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల జలపాతం, హాలియా వాగుల నుంచి 27,527 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజార్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల నీటి నిల్వ 44.43 టీఎంసీలు

అచ్చంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 44.43 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 12,674 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందలు, మొత్తం 17వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో అద్భుత ఫలితాలు

రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్ కుమార్



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ సస్టయినబిలిటీ బృందం

గుంటూరు సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య రైతు సాధికార సంస్థ చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు అద్భుత ఫలితాలను అందిస్తున్నాయని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ సస్టయినబిలిటీ బృందం గుంటూరు జిల్లాను సందర్శించింది. ఈ బృందంలో చైర్‌పర్సన్ ఆంద్రే హాఫ్‌మాన్, రొజాలీ హాఫ్ మాన్, సీఈఓ పవన్ సుఖ్‌దేవ్, గ్లోబల్ అలయన్స్ ఫర్ ఏ సస్టయి నబుల్ ప్లానెట్ సెక్రటరీ జనరల్ సత్య ఎస్.త్రిపాఠి ఉన్నారు. బృందం దుగ్గిరాల మండలం పెద్దపాలెం గ్రామంలోని పాడిబండ కృష్ణప్రసాద్ వరి కాంపాక్ట్ బ్లాకును సందర్శించింది. ప్రకృతి వ్యవసాయ పొలాలు, రసాయన వ్యవసాయ పొలాలను పోల్చి పరిశీలించింది. ప్రకృతి వ్యవసాయంలో రైజోషీత్ 95 సెం.మీగా, రసాయన పొలాల్లో 70 సెం.మీగా నమోదయింది. ప్రకృతి వ్యవసాయ బ్రిక్స్ విలువలు 18, రసాయన రైతుల పొలాల్లో 5 ఉండగా గమనించారు. ప్రకృతి పొలాల్లో టిల్లర్స్ సంఖ్య 45, రసాయన పొలాలలో 17 మాత్రమే గమనించారు. ఈ ఫలితాలు ప్రకృతి విధానాల ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని విజయ్‌కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూతక్కి గ్రామంలో 2016లో నలుగురు రైతులతో ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయం.. 92 శాతం మంది రైతులు అవలంబిస్తున్నారని తెలిపారు. బృంద సభ్యులు రైతు శ్రీనివాస్‌రెడ్డి అరటి, పసుపు పంటల ను, అలాగే రామలింగారెడ్డి సాగు చేస్తున్న పసుపు, మొక్కజొన్న, పిల్లి పెసర ఏ-గ్రేడ్ మోడల్‌ను పరిశీలించారు. రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. గ్రామంలోని పద్మశ్రీ మహిళా సంఘ సమావేశంలో మహిళల పాత్రను బృందం ప్రత్యేకంగా ప్రశంసించింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, థీమాటిక్ లీడ్స్ చంద్రశేఖర్, వాణీశ్రీ, స్థానిక రైతులు, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్టాలిన్‌బాబు ఉద్యమ స్ఫూర్తి.. నేటి తరానికి ఆదర్శం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరరావు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్మికులు, ఉద్యోగులు, రైతుల సమస్యల పరిష్కారానికి బొప్పూడి స్టాలిన్‌బాబు చేసిన పోరాటాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరరావు అన్నారు. శనివారం బొప్పూడి స్టాలిన్‌బాబు పార్థీవదేహానికి పార్టీ నాయకులతో కలిసి ఆయన ఘనంగా నివాళులర్పించారు.



స్టాలిన్ బాబు పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న గుజ్జుల ఈశ్వరయ్య, ముప్పాళ్ల నాగేశ్వరరావు

అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ జీవితాంతం ప్రజల కోసం కష్టపడ్డ వ్యక్తి స్టాలిన్‌బాబు అని కొనియాడారు. ఆయన క్రమశిక్షణ, నేటి కమ్యూనిస్టు కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ స్టాలిన్ పేద ప్రజల హక్కుల సాధనకు పోరాడి వారి నమ్మకాన్ని సంపాదించారని గుర్తుచేసుకున్నారు. ఆయన చూపిన మార్గం మాకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ స్టాలిన్ ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఐ నాయకులు కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, పచ్చల శివాజీ, జి.సురేష్‌బాబు, రాజేంద్ర, సంతోష్, వల్లూరు తాండవకృష్ణ తదితరులు స్టాలిన్‌బాబుకు ఘనంగా నివాళుర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి స్నూకర్ పోటీలు



స్నూకర్ పోటీల్లో తలపడుతున్న ఎల్వీఆర్ క్లబ్ క్రీడాకారుడు షేక్ అన్వర్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మూడో రోజు స్నూకర్ పోటీల్లో వేస్కు అన్వర్, రఫాయత్, వి. సుశీల్ కుమార్, ప్రశాంత్, నిశాంత్ ముందంజలో ఉన్నట్లు నిర్వాహక కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరరావు(అజార్) తెలిపారు. వచ్చే నెల 3 వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించామన్నారు.

స్నూకర్ ఫలితాలు

ఎండి రోషన్, షేక్ అల్తాఫ్‌పై 3-0 స్కోర్‌తో, లక్ష్మణ్, సయ్యద్ అబ్దుల్లా పై 3-0 స్కోర్‌తో, ముస్తఫా, పి.వాసుపై 3-0 స్కోర్‌తో, అవినాష్, పి.వెంకటేశ్వరరావుపై 3-0 స్కోర్‌తో, సయ్యద్ రిజ్వాన్, చంద్రకాంత్‌పై 3-0 స్కోర్‌తో, ప్రభు కిషోర్, ఎన్.వెంకటేశ్వర్ రెడ్డిపై 3-1 స్కోర్‌తో, డి.బాబురావు, ఫన్నీపై 3-2 స్కోర్‌తో, ఎస్కే ఆసిఫ్, సయ్యద్ రియాజ్‌పై 3-1 స్కోర్‌తో, జి.వంశీకృష్ణ, ఎస్.బాలాజీపై 3- 2 స్కోర్‌తో, డి.వంశీకృష్ణ, క్రాంతికుమార్‌పై 3-2 స్కోర్‌తో, శ్రీజన్‌బాబు, వేస్కుతాజుద్దీన్‌పై 3-0 స్కోరుతో గెలుపొందినట్లు తెలిపారు. జాఫర్ హుస్సేన్, జస్వంత్‌పై 3-1 స్కోర్‌తో, అనంత్, వి.హర్షపై 3-0 స్కోర్‌తో, జి.ప్రశాంత్ ఎన్ దీపక్‌పై 3-0 స్కోర్‌తో, నిశాంత్, ప్రతాప్‌పై 3-0 స్కోర్‌తో, వి.సుశీల్‌కుమార్, డి.నాగేశ్వరావుపై 3-0 స్కోర్‌తో, వేస్కు అన్వర్, టి.రాజేష్‌పై 3-2 స్కోర్‌తో, భాను, పీఎస్సీ రాహుల్ పై 3-2, రఫాయత్, సతీష్ పై 3-0 స్కోర్‌తో గెలుపొందారని పులివర్తి వెంకటేశ్వరరావు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మొంథా తుపానుగా మారడంతో అధికారులు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. ఈదురు గాలులతో కూడిన వర్షాలు సంభవిస్తే కొంత మేర ఇబ్బంది కలుగుతుందని.. అధికారులు ముందస్తుగానే ఆయా ప్రాంతాల్లో అత్యవసర సేవలు అందించే విధంగా ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని ప్రకటించారు. అతి భారీవర్షాలు పడితే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావస కేంద్రాలను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతిజిల్లాల్లో వర్షాలు పడే పరిస్థితి నెలకొందని ఆయాప్రాంత అధికారులు అన్ని శాఖల సమన్వయంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీ

సత్తెనపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఉన్న జనసేన రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తుందని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో జనసేన ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో జన సైనికులు కూటమి ప్రభుత్వానికి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. జన సైనికులకు పదవులు ముఖ్యం కాదని, ప్రజలు ముఖ్యమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన కార్యకర్తలు కూడా వివిధ పదవుల్లో పోటీ చేసేందుకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. ఆయనతో పాటు శిరిగిరి శ్రీనివాసరావు, తవిటి భవన్నారాయణ ఉన్నారు.

27, 28 తేదీల్లో ఐఈఆర్‌పీ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు(విద్య), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ(ప్రత్యేక అవసరాల విద్య) టీచర్లకు ఈ నెల 27, 28 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు డీఈవో సీవీ రేణుక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాల వారికి 27న, 28న పల్నాడు జిల్లా అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు www.deognt.blogspot.com వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ముంచుకొస్తోన్న.. మొంథా

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఏర్పాట్లపై కలెక్టర్లు సమీక్షిస్తున్నారు.

దిగుబడుల వేళ ముంపు

ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు ముఖం చాటేశాయి. మేలో ఎక్కువగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత సుమారు రెండు నెలల పాటు ముఖం చాటేశాయి. ఆగస్టు నుంచి మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. ఒకే రోజున 220 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయి. గత ఏడాది కూడా ఇలానే ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం కొంచెం ఆలస్యంగా ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుని రైతులు చేపట్టారు. దీంతో వరి, పత్తి తదితర పంటలు ఇంకా కోతలు చాలా చోట్ల మొదలుకాలేదు. నవంబరు మొదటి వారం తర్వాత కోతలు ఊపందుకుంటాయని అధికారులు భావిస్తూ అందుకు అనుగుణంగా ధాన్యం సేకరణ, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో 2,30,000 ఎకరాల్లో వరి సాగవగా 50 శాతం కోతలకు సిద్ధంగా ఉంది. గుంటూరు జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా పంటలు కోత దశలో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా పత్తి సాగవగా కోత దశకు చేరింది. కంది పంట కూడా వర్షాలకు ఉరకెత్తుతోంది. పత్తి, కంది, వరి పంటలకు వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. చేలల్లో పెద్దఎత్తున వర్షపు నీరు చేరి పూత, పిందె తడిసిపోయాయి. రెండు నెలల వయస్సులో ఉన్న మిర్చి మొక్కలు నీటిలో కుళ్లిపోతున్నాయి. ఎక్కువ రోజులు మొక్క నీటిలో ఉండటంతో తెగుళ్లు సోకుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి వర్షాలు తగ్గుముఖం పట్టగా శనివారం కొన్ని ప్రాంతాల్లో ఎండ వచ్చింది. దీంతో రైతాంగం కొంతమేర ఊపిరి పీల్చుకుంది. ఎలాగోలా సస్యరక్షణ చర్యలు చేపట్టి కోతలు మొదలు పెడదామనుకుంటున్న తరుణంలో మొంథా తుపాను హెచ్చరికలతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అధికవర్షపాతం నమోదైతే డ్రెయిన్లు, పంట కాల్వల్లో నుంచి నీరు పొంగి పొలాల్లో ప్రవహించి రోజుల తరబడి నిలబడిపోయే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే పెట్టుబడులు ఖర్చులు కూడా రాని విధంగా పలు దఫాలుగా వర్షాలు తమను కుదేలు చేశాయని, రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలు నమోదైతే పంటలు ఏమీ మిగలవనే ఆవేదనను రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

యూరియా బస్తా రూ.450

(5వ పేజీ తరువాయి)

విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి పత్తి, మిరప, కంది పంటలు ఉరకెత్తి ఎండిపోతున్నాయి. అయా పంటలను కాపాడుకునేందుకు పొలంలో నిలిచిన నీరు బయటకు పంపి.. యూరియా పంటకు వినియోగించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు యూరియా కొనుగోలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరాను వారం రోజులుగా నిలిపివేశారు. అక్కడక్కడా కొన్ని సొసైటీల్లో మాత్రమే యూరియా నిల్వలు ఉన్నాయి. అధిక వర్షాల వల్ల యూరియాకు డిమాండ్ ఏర్పడడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు అధిక ధరకు యూరియాను విక్రయిస్తున్నారు. ప్రభుత్వం యూరియా బస్తా ధర రూ.266.65గా నిర్ణయించింది. అయితే కొన్ని మండలాల్లో బస్తా రూ.420 నుంచి రూ 450 వరకు విక్రయిస్తున్నారు. అధిక ధరలను నియంత్రించడంలో వ్యవసాయ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నెలాఖరు వరకు కష్టం..

కొన్ని సొసైటీలకు సరఫరా చేసే ఎరువులు రాజకీయ అండదండలు ఉన్న రైతులకే అందుతున్నాయన్న విమర్శలున్నాయి. సొసైటీల కంటే ఆర్ఎస్‌కేల ద్వారా ఎరువులు విక్రయిస్తే అందరికి న్యాయం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఈ నెలాఖరు వరకు రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేసే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ-క్రాప్ బుకింగ్ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలి. దీంతో ఆర్ఎస్‌కేలకు ఎరువులను సరఫరా చేస్తే పంట నమోదు పూర్తి కాదన్న వాదనను వ్యవసాయశాఖ అధికారులు వినిపిస్తున్నారు. అప్పటి వరకు రైతులు ప్రైవేట్ వ్యాపారులపైనే ఎరువుల కోసం ఆధారపడాల్సి ఉంది. దీనిపై వ్యవసాయ శాఖ జేడీని వివరణ కోరగా అధిక ధరకు యూరియా విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అధిక రేట్లకు ఎరువులు విక్రయించిన ఆరు షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా అధిక రేటుకు ఎరువులు విక్రయిస్తే సమీప వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. యూరియా నిల్వలు జిల్లాలో సమృద్ధిగా ఉన్నాయని చెప్పారు.

నీటి సంఘాలకు.. జీఎస్టీ బాదుడు!

(5వ పేజీ తరువాయి)

సదరు నీటి సంఘాల సభ్యులు వాపోతున్నారు. తాము కాంట్రాక్టర్లం కాదని, జీఎస్టీని రద్దు చేయాలని.. బిల్లుల నుంచి మినహాయించరాదని వారు కోరుతున్నారు. మినహాయించిన జీఎస్టీని ఇన్‌పుట్ బిల్లులు దాఖలు చేస్తే తిరిగి చెల్లించే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే కాలువల మరమ్మతులకు ఇన్‌పుట్ బిల్లులు ఎలా ఉంటాయని నీటి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మొత్తం మీద జీఎస్టీ కోత నీటి సంఘాలకు మింగుడుపడనిదిగా ఉంది. ప్రభుత్వం జీఎస్టీ విషయంలో పునరాలోచన చేయాలని నీటి సంఘాలు కోరుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే నసీర్

మహిళల స్వయం ఉపాధికి కృషి

గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అంజుమ్-ఏ- ఇస్లామియా ఆధ్వర్యంలో మహిళల స్వయం ఉపాధికి సహకారం అందించటం అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అంజుమన్ పాఠశాలలో ఉచిత కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు శనివారం ఆయన ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసే విధంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అంజుమన్ స్కూల్లో త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. తద్వారా ఎక్కువ మందికి స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు సహకరించిన మంత్రి పెమ్మసానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫైదా, జహీద్, షౌకత్, రెహమాన్, మాగబుల్, జాదా, ప్రిన్సిపాల్ హసీనా, ట్రైనర్ సల్మా తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు రూ.32లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే నసీర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు.

నేడు రాజోలులో ఉపకార వేతనాల పంపిణీ



తులసీ యోగీష్ చంద్ర

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణదేవ రాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, గుంటూరు' 'ది రాజోలు తాలూకా తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం, రాజోలు' వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 280 మంది పేద విద్యార్థులకు రూ. 11 లక్షల 45వేలు ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేయనున్నట్లు తులసీ గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ. 5లక్షల 30వేలు తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం శివకోడులోని మంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమౌతుందన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా తులసి గ్రూప్ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై ఉపకార వేతనాలను అందజేస్తారని తెలిపారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బాస్కెట్ బాల్ పోటీల్లో ఏసీఎంఈ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ బాలికల విభాగ పోటీల్లో స్థానిక పొత్తూరులోని ఏసీఎంఈ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ సౌగంధ్‌కృష్ణ నందమూరి శనివారం తెలిపారు. బాలుర విభాగంలో ఏసీఎంఈ స్కూల్ రెండవ స్థానం సాధించిందని వెల్లడించారు. విద్యార్థులను డైరెక్టర్ సౌగంధ్ కృష్ణ నందమూరి, ప్రిన్సిపాల్ దీప్తి నందమూరి అభినందించారు.

గ్రంథాలయ సంస్థ సెస్సు బకాయిలను చెల్లించాలి

● జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ



మాట్లాడుతున్న జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ

గుంటూరు (తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్సు బకాయిలను చెల్లించాలని అయా మున్సిపల్ కమిషనర్లకు జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు కలెక్టరేట్‌లో గ్రంథాలయ సెస్సు బకాయిలపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు దాదాపు రూ.64 కోట్లు సెస్సు బకాయిలు ఉన్నాయని వివరించారు. ఆ బకాయిలను ప్రతి నెలా కొంత మొత్తం చొప్పున విధిగా చెల్లించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో గ్రంథాలయ అధికారులు, ఆడిట్ అధికారులు, మంగళగిరి, తెనాలి, పొన్నూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

31న ఐక్యత జిల్లాస్థాయి పాదయాత్ర

గుంటూరు (తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 31న నగరంలో జిల్లాస్థాయి ఐక్యత పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు మేరా యువ భారత్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ దాస్ ప్రసాదు తెలిపారు. గుంటూరులో నెహ్రూ యువ కేంద్రంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ, 31న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర ప్రభుత్వ మహిళా కళాశాల వరకు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మద్దినేని సుధాకర్, జిల్లా నోడల్ అధికారి సుధీర్‌కుమార్, బీజేపీ నాయకుడు రామకృష్ణ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ద్వంద్వ వైఖరి సిగ్గు చేటు: లాల్ వజీర్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గూగుల్ సంస్థ ఏపీకి రావటాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన వైసీపీ నాయకులు ఇప్పుడు గూగుల్‌ని స్వాగతిస్తున్నామని మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు కృషితో ఏపీకి గూగుల్ సంస్థ రావడాన్ని ప్రజలందరూ హర్షం వ్యక్తం చేయడంతో నేడు జగన్ రెడ్డి మాటమార్చి నీతి మాటలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గూగుల్‌ను తామే తీసుకొచ్చామని జగన్‌రెడ్డి అబద్ధాలు, మాయమాటలతో ప్రజలను మరోసారి వంచనకు గురిచేయాలని ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. సమావేశంలో షేక్ బాజీ మాస్టర్, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

30న జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

గుంటూరు (తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఐక్య వ్యవస్థాపకులు డాక్టర్ గోళ్ళమూడి రాజు సుందరం బాబు పిలుపునిచ్చారు. స్థానిక అరండల్‌పేటలో శనివారం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. 30 తేదీ ఉదయం కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, అనంతరం రెవెన్యూ కల్యాణ మండపంలో సభ జరుగుతుందన్నారు. ఏఈఎల్‌సీ నాయకులు రవికాంత్, సురేష్ పాల్గొన్నారు.

17న ఎన్జీజీవో సీటీ తాలుకా ఎన్నికలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్, గుంటూరు సిటి తాలూకా యూనిట్ ఎన్నికలను ఏపీ ఎన్జీజీవో హోమ్‌లో నవంబరు 17న నిర్వహిస్తున్నట్టు సీటీ తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌పీఎస్ సూరి, సీహెచ్ కళ్యాణ్ కుమార్ తెలిపారు. 7న ఓటర్ల నమోదు, 10న నామినేషన్ ప్రక్రియ, 17న ఉదయం 8 గంటల నుంచి 3 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు.

30న మెగా జాబ్ మేళా : కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు

గుంటూరు (విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వెల్లడించారు. ఈ మేరకు జాబ్ మేళా పోస్టర్లను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. 30వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పొన్నూరు రోడ్‌లోని ఆంధ్రా ముస్లిం కళాశాల ప్రాంగణంలో ఈ మెగా జాబ్ మేళా జరుగుతుందని చెప్పారు. దాదాపు 30కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 935 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మాట్లాడుతూ, గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసి, పీజీ విభాగాల్లో విద్యార్హత ఉన్న 18-25 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు 98663 66187, 7731982861, 9581794605 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు యూ.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌పై కంట్రోల్ రూమ్

● గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ శ్రీనివాసబాబు

గుంటూరు, అక్టో బరు 25(ఆంధ్ర జ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎక్కడా ఎటువంటి ప్రమాదాలు, అంత రాయాలు లేకుండా చేసేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు తెలిపారు. తుపాను ప్రభావంపై నిరంతరం పర్యవేక్షణ చేసేలా నల్లచెరువులోని డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లో జూనియర్ ఇంజనీర్స్ ఇతర సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రజలు తుఫాన్ ప్రభావంతో ఎటువంటి విద్యుత్ సమస్యలు ఏర్పడినా కంట్రోల్ రూమ్ నంబర్లు 9440817527, 9440817526కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని కోరారు. ఈనెల 30 వరకు ఆపరేషన్ విభాగం ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్లు స్పష్టం చేశారు.

ఎన్‌సీసీపీఏ నూతన అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్ (ఎన్‌సీసీపీఏ) ఆంధ్రప్రదేశ్‌శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గుంటూరు బ్రాడిపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగింది. ఈ మేరకు రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా నిమ్మగడ్డ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఏ.చిట్టిబాబు, సీహెచ్ నరసింహమూర్తి, పి.గోపాలకృష్ణ, టీఆర్.ప్రభాకరరావు, జనరల్ సెక్రటరీగా కె.సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ సెక్రటరీలుగా గుమ్మడి సీతారామయ్య చౌదరి, కె.చంద్రశేఖర్, టి.నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎ.శ్రీరంగనాథ్, ట్రెజరర్‌గా ఈ.భానుబాబు, అసిస్టెంట్ ట్రెజరర్‌గా బి.చంద్రశేఖరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.మహేశ్వర రావు, తురగా సూర్యరావు, బీఎస్‌మిత్ర, రమణరాజు ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గాన్ని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పెన్షనర్లు అభినందించారు.

పీపీపీపై అసత్య ప్రచారాలు ఆపండి : డాక్టర్ ఆలా

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ అంటే ప్రైవేటీకరణ కాదని, ప్రభుత్వం వద్ద తగిన నిధులు లేకపోవడం వలన కార్పొరేట్ వైద్య సంస్థలను ఆహ్వానిస్తున్నామని, పీపీపీతో మెడికల్ సీట్లు పెరుగుతాయని చెబుతున్న అవాస్తవాలను ఖండిస్తున్నట్టు ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ, కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన 5 వైద్య కళాశాలలకు ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ కేటాయించిన 60 పీజీ సీట్లను పూర్తిగా కన్వీనర్ కోటా విధానంలోనే భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కో కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వివరిస్తూ జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరిచి ప్రజాభిప్రాయాన్ని కూడగడతామన్నారు. సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ కొరివి వినయ్ కుమార్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి తెనాలి జాన్‌బాబు, కోశాధికారి గోరంట్ల వెంకట్రావు, లంబాడి హక్కుల పోరాట సమితి నేత డి.చంద్రా నాయక్ తదితరులు మాట్లాడారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌తో విస్తృత ఉపాధి అవకాశాలు

గుంటూరు(విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచీకరణ నేపథ్యంలో క్వాంటం కంప్యూటింగ్ విద్యకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని కేహెచ్‌ఐటీ చైర్మన్ కళ్ళం మోహన్ రెడ్డి అన్నారు. చౌడవరంలోని కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో "ది క్వాంటం క్యాంబిల్" పేరుతో క్వాంటం కంప్యూటర్ కోర్సు నూతన తరగతులను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో తొలిసారిగా క్వాంటం కంప్యూటింగ్ తరగతులు ప్రారంభించినట్లు చెప్పారు. డైరెక్టర్ డాక్టర్ మొవ్వ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక విద్యలో క్వాంటం కంప్యూటింగ్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీఎస్‌బీ రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ జర్సన్ , అధ్యాపకులు డాక్టర్ నాగార్జున, చుక్క శ్యాంసన్, కె.నాగేశ్వరరావు, డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

గుంటూరు (తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీన ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాధ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 26వ తేదీన దేశవ్యాప్తంగా 12 కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, వివిధ రాష్ట్రాలలోని కార్మిక సంఘాలు ఐక్యంగా నాలుగు లేబర్ పాలసీలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడా హనుమంతరావు, రావుల అంజిబాబు పాల్గొన్నారు.

స్టాలిన్ బాబు మృతి తీరని లోటు

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత స్టాలిన్‌బాబు మృతి ప్రజాతంత్ర వాదులకు తీరని లోటని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. శ్యామలానగర్‌లోని నివాసంలో బొప్పూడి స్టాలిన్ బాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టాలిన్ బాబు విద్యార్థి, యువజన నేతగా గొప్ప పేరు తెచ్చుకొని స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బృందావన్ గార్డెన్స్ కుందుల రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొరిటెపాడుకు చెందిన స్కూల్ బస్సు డ్రైవర్ నందిగం సురేష్ (55) మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు సంగడిగుంట ఆరవ లైనుకు చెందిన సురేష్ కుటుంబం కొంతకాలంగా కొరిటెపాడులో నివాసం ఉంటుంది. సురేష్ ఓ ప్రైవేటు స్కూల్ బస్సుకు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఆయనకు భార్య శ్రీలత, కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. ఇదిలా ఉంటే శనివారం రాత్రి సురేష్ తన స్కూటీ వాహనంపై శ్యామలనగర్ వైపు నుంచి కొరిటెపాడు వచ్చేందుకు కుందుల రోడ్డులో వస్తుండగా కంకరలోడుతో వెళుతున్న టిప్పర్ స్కూటిని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను కుటుంబ సభ్యులు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రికి వెళ్లిన కొద్ది నిమిషాలలోనే సురేష్ కన్నుమూశారు. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలలో బేబీ కేర్ సెంటర్

గుంటూరు మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో కొత్తగా బేబీ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లో బేబీ కేర్ సెంటర్లు పని చేస్తుండగా, వాటికి మంచి ఆదరణ దక్కుతోంది. ఈ నేపథ్యంలో జీఎంసీలో కూడా ఇటువంటి సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ నిర్ణయించారు. కాగా, జీఎంసీ 1967వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు డాక్టర్ కె.కళాధర్, ఎన్నారై డాక్టర్ విజయ రామరాజు (అమెరికా) శనివారం వైద్య కళాశాలను సందర్శించారు. డాక్టర్ సుందరాచారీ, బేబీ కేర్ సెంటర్ ప్రతిపాదన వారికి వివరించారు. ఇందుకయ్యే ఖర్చును విరాళంగా అందజేయాలని కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలు అందజేస్తే నిధులు అందజేస్తామని డాక్టర్ కళాధర్ హామీ ఇచ్చారు. కళాధర్, విజయ రామరాజును జీఎంసీ వర్గాలు ఘనంగా సన్మానించాయి.

నిధులు ఉన్నంత మేరకు అనుమతులు ఇచ్చాం

● జడ్పీ సీఈవో జ్యోతి బసు

గుంటూరు సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో నిధుల లభ్యత మేరకు పనులను చేసేందుకు అనుమతులు ఇచ్చామని జడ్పీ సీఈవో వీర్ల జ్యోతి బసు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, రూ.25 కోట్ల కు సంబంధించిన పనులకు తాను అనుమతి ఇవ్వకుండా ఉన్నానన్న మాటల్లో వాస్తవం లేదన్నారు. రూ.25 కోట్ల పనులకు ప్రతిపాదనలు వచ్చాయని, నిధులు లభ్యత ఆధారంగా వాటికి అనుమతి ఇవ్వాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఇప్పటికే ఉన్న నిధులను మించి పనులకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఈ విషయం మీద అవగాహన లేక కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే ప్రతిపాదనలను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సూచనలు, ఆదేశాలు మేరకు పరిశీలించి నిధులు కేటాయించటంలో తాను ముందుంటానని జ్యోతిబసు స్పష్టం చేశారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి : ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ప్రతిష్ఠ కాపాడే విధంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు జారీ చేసారు. పోలీస్ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, ధైర్యం, చట్టపరమైన నిబద్ధత అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ క్రైమ్స్, మహిళల భద్రత, గంజాయి మత్తు వ్యసనాలు, రోడ్డు ప్రమాదాలు, ఆస్తి దొంగతనాలు వంటి నేరాల నిర్మూలనకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

పోలీస్ విధులపై అవగాహన పెంచుకోవాలి

పోలీస్ విధులు, స్టేషన్‌లో పరికరాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు పోలీస్ స్టేషన్లను సందర్శించి, పోలీస్ శాఖ నిర్వహించే దైనందిన విధులు, వాడే పరికరాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులు గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



అరండల్‌పేట శివాలయంలోని నాగేంద్ర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని నగరంలోని పలు శివాలయాలలో, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలలో, పుట్టలలో శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పుట్టలలో పాలు పోసి, నానబెట్టిన సజ్జలు, చలివిడిని నైవేద్యంగా సమర్పించారు. బ్రాడీపేటలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద, అరండల్ పేట శివాలయం, సంపత్‌నగర్ రామనామ క్షేత్రం, శ్రీనివాసరావు పేటలోని 60 అడుగుల రోడ్డులోని సుబ్రమణ్య స్వామి పుట్ట, రవీంద్ర నగర్‌లోని నాగేంద్ర పుట్ట స్వామి, ఆర్టీవో కార్యాలయం, ఎస్పీ బంగ్లా రోడ్డులోని నాగేంద్ర స్వామి పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాగ్గేయకార మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ కళావేదిక సంస్థ వేదికపై వాగ్గేయకార మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ మహోత్సవాలు ఈ నెల 29 వరకు కొనసాగనున్నాయి. వీవీఐటి వైస్ చాన్సలర్ విద్యాసాగర్, సాంస్కృతిక సలహాదారు విశ్వేశ్వరరావు ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్, ఉపాధ్యక్షుడు గిరిజా శంకర్ విచ్చేసిన అతిథులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తొలుత నూజి వీడు సీడ్స్ ఛైర్మన్ కారుమంచి ప్రసాదు, ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్రాంత ఎస్‌బీఐ మేనేజర్ చదలవాడ వేంకట రమణి, కూచిపూడి నృత్య అకాడమి హైదరాబాదు వారు మిద్దె కిరణ్మయి బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



ఖాళీ స్థలాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ఖాళీ స్థలాల విషయంలో నిర్లక్ష్యం తగదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖాళీ స్థలాల విషయంలో నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారంటూ అధికారులపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా వచ్చిన వినతులపై శనివారం ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆరా తీశారు. సంపత్‌నగర్ జెండా చెట్టు ప్రాంతానికి చెందిన కొంతమంది మహిళలు తమ ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు చిట్టడవుల్లా మారి, విషసర్పాలు తిరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. దోమల వల్ల పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో పర్యటించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. చుట్టుపక్కల ఖాళీ స్థలాలు పూర్తిగా చెట్లు, పొదలతో నిండిపోయి ఉన్నాయని గుర్తించారు. వెంటనే స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని పిలిపించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలాలపై బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించినా, ఇప్పటికీ చర్యలెందుకు తీసుకోలేదంటూ నిలదీశారు. స్థల యజమానులను వెంటనే సంప్రదించి ఆ స్థలాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు.

నార్ల ఆడిటోరియం పనులు త్వరలో పూర్తి

నార్ల ఆడిటోరియం పనులు త్వరలో పూర్తి చేస్తామని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆడిటోరియం పాడైపోయిన స్థితిలో ఉన్నా గడిచిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. రూ. 6 కోట్లతో నార్ల ఆడిటోరియం పనులు పూర్తి చేసి గుంటూరు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

ఎంపీ లావుతో జడ్పీ ఛైర్‌పర్సన్ భేటీ



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డాక్టర్ కత్తెర సురేష్ కుమార్

గుంటూరు సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలతో జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శనివారం భేటీ అయ్యారు. ఎంపీ నివాస గృహంలో ఆయనను కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ నెల 29న సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసిన సంగతి కూడా తెలిపినట్లు తెలిసింది. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేశ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

జైత్రయాత్రలా సీఎం యూఏఈ పర్యటన

● ఏపీఐడీసీ ఛైర్మన్ దేగల ప్రభాకర్



దేగల ప్రభాకర్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు యూఏఈ పర్యటన జైత్రయాత్రలా సాగిందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని వైసీపీ ఎన్ని కుట్రలు చేస్తున్నా రాష్ట్రాభివృద్ధే అజెండాగా, ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఓవైపు సీఎం చంద్రబాబు యూఏఈలో పెట్టుబడి వేట కొనసాగిస్తుంటే, మరోవైపు ఆస్ట్రేలియాలో రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ శ్రమిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పెట్టుబడుల గమ్యంగా మార్చడమే లక్ష్యంగా సీఎం యూఏఈ పర్యటన సాగిందని పేర్కొన్నారు. దుబాయ్, అబుదాబీ వంటి దేశాల్లో పర్యటించి రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, హౌసింగ్ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై అనేక కంపెనీల ప్రతినిధులతో సీఎం చర్చించారని తెలిపారు. కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త అవకాశాలతో రాష్ట్రం మళ్లీ ప్రగతి దిశగా అడుగేస్తోందని ప్రభాకర్ పేర్కొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి

గుంటూరు (విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ ఇచ్చేలా మాస్టర్ ట్రైనీలు సిద్ధం కావాలని జిల్లా కో-ఆర్డినేటర్ తోట వీరయ్య సూచించారు. స్థానిక సెయింట్ జోసెఫ్ బీఈడీ కళాశాలలో రెండు రోజులపాటు జిల్లాలోని 18 మండలాల్లోని మాస్టర్ ట్రైనీలకు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. కో-ఆర్డినేటర్ వీరయ్య మాట్లాడుతూ, ఈ శిక్షణకు ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున మాస్టర్ ట్రైనర్లు వచ్చారని చెప్పారు. వారు వారి మండలాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. అనంతరం జిల్లా ఏఎంవో రమ్యశ్రీ మాట్లాడుతూ, మెగా డీఎస్సీ 2025 ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, టి.నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లోకి ఫిల్మ్ చాంబర్?

30 ఏళ్ల భవనాల కూల్చివేతకు రంగం సిద్ధం.. భారీ వాణిజ్య భవనం నిర్మాణానికి కసరత్తు

- లీజు ముగియకుండానే ఖాళీ ప్రయత్నం
- ఎలాగైనా అడ్డుకుంటామన్న మెజార్టీ సభ్యులు
- మొత్తం భవనం ఇండస్ట్రీకే వాడాలి: సురేశ్‌బాబు

(సినిమా డెస్క్)

గత మూడు దశాబ్దాలుగా జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్ చాంబర్ భవనం తెలుగు సినీ పరిశ్రమకు ఒక చిరునామాగా మారింది. అక్కడే నిర్మాతల మండలి, నిర్మాతల కోసం నిర్మించిన గదులు, రిక్రియేషన్ క్లబ్ మొదలైనవన్నీ ఉన్నాయి. ఈ ప్రాంతంలో కొందామంటే గజం భూమి దొరకదు. అలాంటిది ఎకరంపైనే విస్తీర్ణంలో ఉన్న ఫిల్మ్ చాంబర్ భవనాలపై కొందరి కన్ను పడింది. అక్కడున్న నిర్మాణాలన్నీ కూల్చేసి, బహుళ అంతస్తుల భవనం కట్టాలని వారు సంకల్పించారు. అయితే, తెలుగు సినీ పరిశ్రమకు వారసత్వంగా వస్తున్న చాంబర్ భవనాలను కూల్చొద్దని మెజారిటీ సభ్యులు కోరుకుంటున్నారు. వీరి విన్నపాలు వినకుండా ఫిల్మ్‌నగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ... ఫిల్మ్ చాంబర్ పాలక మండలిలో తమకు అనుకూలంగా ఉన్న కొందరితో కలిసి ఏకపక్షంగా భవనాలను కూల్చేందుకు రంగం సిద్ధం చేసింది. చాంబర్ పాలకమండలి గడువు ముగిసినా ఎన్నికలు జరపకుండా ఎప్పటికప్పుడు వాయిదా వేయడానికి కారణం కూడా కొత్త పాలకమండలి వస్తే బహుళ అంతస్తుల భవనం ప్రతిపాదనకు ఎక్కడ అడ్డం పడుతుందోనన్న భయంతోనే అని సభ్యులు ఆరోపిస్తున్నారు.

తొలి అడుగులు

మూడు దశాబ్దాల క్రితం తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి వస్తున్న సమయంలో సినీ పరిశ్రమలో పని చేసే వారికి ఇళ్ల స్థలాల అవసరాల కోసం ఫిల్మ్‌నగర్ సహకార హౌసింగ్ సొసైటీ ఏర్పడింది. అదే సమయంలో నిర్మాతలు, దర్శకులు, డిస్ట్రిబ్యూటర్స్ ఎగ్జిబిటర్ల వాణిజ్య అవసరాల కోసం భవంతులు అవసరమయ్యాయి. జి.హనుమంతరావు. రమేష్ ప్రసాద్, రామానాయుడు, వి.బి.రాజేంద్రప్రసాద్, డి.వి.ఎస్ రాజు, ఎం.ఎస్.రెడ్డి, సత్యచిత్ర సూర్యనారాయణ మొదలైన సినీ ప్రముఖులు ఉమ్మడిగా చేసిన విజ్ఞప్తి మేరకు హౌసింగ్ సొసైటీ రిక్రియేషన్ కోసం ఉద్దేశించిన భూమిలో కొంత చాంబర్‌కు లీజుకు ఇచ్చింది. ఇందులోనే చాంబర్ కొన్ని భవనాలు నిర్మించింది. నిర్మాణానికి సినీ ప్రముఖులు కూడా కొంత విరాళం ఇచ్చారు. అప్పట్లోనే 1.16 కోట్ల రూపాయల ఖర్చు అయిందని అంచనా. తర్వాత నాలుగేళ్లకు నిర్మాతల మండలికి, మరో 8 మంది నిర్మాతలకు హౌసింగ్ సొసైటీ మరికొంత భూమి ఇచ్చి లీజు ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రముఖ నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ కొండ మీద ఉన్న స్థలంలో దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఇలా ఈ స్థలమంతా సినిమా ఇండస్ట్రీకి కేంద్ర బిందువుగా మారింది.

లీజు పూర్తయిందని..

ఈ భూమిని 30 సంవత్సరాలకు లీజుకు ఇచ్చారు. ఇది వచ్చే ఏడాది ముగుస్తుంది. నిర్మాతల మండలికి, నిర్మాతలకు ఇచ్చిన లీజులు మాత్రం 2030 దాకా ఉన్నాయి. ఇక్కడ భూముల ధరలు ఆకాశానికి అంటిన నేపథ్యంలో హౌసింగ్ సొసైటీ మొత్తం భూమిని స్వాధీనం చేసుకొని బహుళ అంతస్తుల భవనాన్ని కట్టాలనే ప్రతిపాదన తెచ్చింది. స్థలంలో చాంబర్, నిర్మాతల మండలి కార్యాలయాలు ఉన్నందున వారి అంగీకారం కోసం ఏడాదిగా చాంబర్‌లో, నిర్మాతల మండలిలలో చర్చలు జరుగుతున్నాయి. అయితే, దీనిపై సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. తెలుగు సినీ పరిశ్రమకు ల్యాండ్‌మార్క్‌గా ఉన్న భవనాలను తీసేయడాన్ని మెజారిటీ సభ్యులువ్యతిరేకించటం మొదలపెట్టారు. చర్చలు కొనసాగుతుండగానే చాంబర్ పాలక వర్గంలో కొందరు హౌజింగ్ సొసైటీతో చేతులు కలిపి కూల్చివేతకు అనుకూలంగా పావులు కదిపారని వార్తలు గుప్పుమన్నాయి. చాంబర్ అద్దెకు ఇచ్చిన షాపులను, బ్యాంకును ఖాళీ చేయించడం అనుమానాలను బలపరిచింది. ఏం జరుగుతుందో తెలుసుకొనే ప్రయత్నం సభ్యులు చేస్తుంటే చాంబర్ పాలక మండలి నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. '30 ఏళ్ల కిందట తరలివచ్చిన సినిమా పరిశ్రమకు ఈ భవనం సంకేతం. దీన్ని కూల్చటానికి మేము ఒప్పుకోం. అవసరమైతే కోర్టుకు వెళ్తాం" అని చాంబర్ సభ్యుడొకరు చెప్పారు.



ఆఫర్‌లు ఇస్తున్నారు

నాకు 800 చదరపు అడుగుల ఆఫీసు ఉంది. రెండేళ్ల క్రితం దీనిని 20 లక్షలు వెచ్చించి పునఃనిర్మించుకున్నాను. సొసైటీ కమిటీలో ఒక సభ్యుడు వచ్చి, మీరు ఎందుకు అభివృద్ధిని ఆపుతున్నారు? మీకేం కావాలో చెప్పండి సెటిల్ చేస్తాం అన్నారు. నాలాగే ఇతరులకు కూడా ఇలాంటి ఆఫర్స్ ఇచ్చారు. కొందరు తీసుకున్నారని విన్నాను. సినీ ప్రముఖులందరూ విరాళాలు సేకరించి కట్టుకున్న భవంతులివి. నిర్మించి 30 ఏళ్లే అయ్యింది. ఎందుకు కూల్చేయాలి? అంగీకరించం.

- చాంబర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్

భవనం సినీ పరిశ్రమకే ఉండాలి


పరిశ్రమ ఎదగడంలో భాగంగా మారిన భవంతులను కూలగొడతామంటే బాధగా ఉంది. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. ఈ రోజు ఫిల్మ్ నగర్ అంటే హైదరాబాద్‌కే ఐకాన్. సినీ పరిశ్రమకు కేంద్ర బిందువు. అక్కడ జరిగే ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో సినీ పరిశ్రమను భాగస్వామ్యం చేయాలి. సీఎం రేవంత్ హైదరాబాద్‌ను వినోద రంగానికిప్రపంచంలోనే కేంద్ర స్థానంగా మారుస్తామంటున్నారు. అలాంటప్పుడు ఇక్కడ ఎలాంటి భవంతులు కట్టినా అది తెలుగు పరిశ్రమకు ప్రతిష్టను తెచ్చేదిగా ఉండాలి. దానిలో పరిశ్రమ సంబంధిత కార్యక్రమాలు మాత్రమే నిర్వహించుకొనేలా ఉండాలి

- డి.సురేష్‌బాబు, ప్రముఖ నిర్మాత

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

జటాధరుడికి జో లాలి



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా దర్శకద్వయం వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇటీవలె విడుదలైన టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా మేకర్స్ 'జో లాలి జో...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. శ్రీమాన్ కీర్తి సాహిత్యానికి రాజీవ్ రాజ్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. పావని వాసా, రాజీవ్ రాజ్ మైమరిపించేలా ఆలపించారు.



శరవేగంగా చిత్రీకరణ

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ ఓ హారర్ కామెడీ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. 'వీటీ15' అనేది వర్కింగ్ టైటిల్. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. వరుణ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్, ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'వరుణ్ కెరీర్‌లోనే ఈ సినిమా ప్రత్యేకంగా ఉండబోతోంది. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్- తమన్ కాంబినేషన్‌లో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికర అప్డేట్స్ త్వరలో ఇవ్వబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు.




రష్మికకు అవార్డు ఖాయం

అల్లు అరవింద్

'ఈ 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం కథను రాహుల్ నాలుగేళ్ల క్రితం చెప్పాడు. 'ఆహా'కు వెబ్ సిరీస్ చేయాలనే ప్లాన్‌లో ఉన్నాడు. కానీ, ఇలాంటి మంచి కథతో సినిమా చేస్తేనే బాగుంటుందని అనిపించింది. ఈ కథలో హీరోయిన్ క్యారెక్టర్ చాలా ఇంటెన్స్‌గా ఉంటుంది. అలాంటి పాత్రకు రష్మిక మాత్రమే న్యాయం చేయగలదు అని అనిపించింది. తను నాకు కూతురు లాంటిది. ఈ సినిమాలో నటనకు గాను రష్మికకు ఉత్తమ నటి అవార్డు రావడం ఖాయం' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. రష్మిక మందన్న లీడ్ రోల్‌లో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. దీక్షిత్ శెట్టి కథానాయకుడు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలో ట్రైలర్‌ని విడుదల చేశారు. రష్మిక మాట్లాడుతూ 'ఈ చిత్రం కథ విన్నప్పుడు ఇప్పటివరకూ ఇలాంటి ప్రేమ కథని మనం చూడలేదనిపించింది. మనందరి జీవితాల్లో ఇలాంటివి జరుగుతాయి కదా అని అనిపించింది. ఇందులో భూమా అనే పాత్రలో నటించాను. నా కెరీర్‌లో సరైన సమయంలో సరైన ఎంపిక ఈ ప్రాజెక్ట్' అని అన్నారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నేను విద్యార్థిగా హాస్టల్‌లో ఉండే రోజుల్లో అనుకున్న కథ ఇది. ట్రైలర్‌లో చూపించినట్లే సినిమా ఆద్యంతం మనసును కదిలించే భావోద్వేగాలతో ఉంటుంది. ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'రష్మిక లేకుంటే 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమానే లేదు. దీక్షిత్ మాకు దొరికిన గొప్ప నటుడు. ఈ చిత్రం తర్వాత ఆయన టాలీవుడ్‌లో మరో పదేళ్లు వరుసగా సినిమాలు చేస్తారు' అని అన్నారు.

బాలీవుడ్ హాస్యనటుడు సతీశ్ షా కన్నుమూత



బాలీవుడ్ వెండితెరపై హాస్యనటుడిగా తనదైన ముద్ర వేసిన సతీశ్ షా(74) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవలే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అయినా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు సతీశ్ రవిలాల్ షా. 1951లో ముంబైలో జన్మించారు. పుణేలోని ప్రతిష్ఠాత్మక ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో నటనలో శిక్షణ తీసుకున్నారు. హిందీ సినిమా చరిత్రలో అత్యుత్తమ హాస్య చిత్రాల్లో ఒకటిగా భావించే 'జానే భీ దో యారో' చిత్రంలో అవినీతిపరుడైన మున్సిపల్ కమీషనర్ డి మెల్లో పాత్రలో సతీశ్ నటన చిరస్మరణీయంగా నిలిచింది. అలాగే బాలీవుడ్ బ్లాక్‌బస్టర్స్ 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, హమ్ ఆప్ కె హై కౌన్, మైహూనా, కల్ హో నా హో' లాంటి చిత్రాల్లో ఆయన సహాయ పాత్రల్లో అలరించారు. టీవీ రంగంలో సతీశ్ షా ప్రతిభను నిరూపించిన తొలి కార్యక్రమం 'యే జో హై జిందగీ'. ఈ హాస్య ధారావాహికలో 55 ఎపిసోడ్లలో 55 విభిన్న పాత్రలను పోషించి అరుదైన ఘనతను షా సాధించారు. 'సారాభాయ్ వర్సెస్ సారాభాయ్' షోలో అత్తాకోడళ్ల మధ్య తగవులు పెట్టే ఇంద్రవదన్ సారాభాయ్ పాత్రతో ఆయన బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు. ఐదు దశాబ్దాల పాటు సాగిన ఆయన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో 200కు పైగా సినిమాలు, పలు టీవీ సీరియల్స్‌లో నటించి ప్రేక్షకులను అలరించారు. 1982లో ఆయన ఫ్యాషన్ డిజైనర్ మధు షాను వివాహం చేసుకున్నారు.

గుర్తుండిపోయే విజయం

ప్రదీప్ రంగనాథన్

"డ్యూడ్' సినిమా వంద కోట్ల వసూళ్లను అధిగమించింది. ప్రేక్షకుల ఆదరణ లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. గుర్తుండిపోయేలా అద్భుత విజయాన్ని అందించిన ఆడియన్స్‌కు కృతజ్ఞతలు. హౌస్‌ఫుల్ కలెక్షన్లతో సినిమా దూసుకుపోతోంది' అని అన్నారు హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా, మమిత బైజు కథానాయికగా కీర్తీశ్వరన్ తెరకెక్కించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై వై. రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించారు. ఇటీవలె సినిమా విడుదలై ప్రేక్షకాదరణతో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. చిత్ర దర్శకుడు కీర్తీశ్వరన్ మాట్లాడుతూ 'నా తొలి చిత్రం మైత్రీ బేనర్‌లో భారీ విజయాన్ని అందుకొన్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇంత గొప్పగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. నిర్మాత వై.రవిశంకర్ మాట్లాడుతూ 'మా సినిమాకు తెలుగుతో పాటు తమిళంలోనూ అద్భుతమైన ఆదరణ దక్కుతోంది. మా సంస్థలో పరిచయమైన భరత్ కమ్మ, నితీష్ రానా, బుచ్చిబాబు సానా పెద్ద దర్శకులుగా ఎదిగారు. ఇప్పుడు అదే కేటగిరీలో కీర్తీశ్వరన్ చేరినందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు.



భావోద్వేగ ప్రేమ గాథ



మిన్నాజ్ రుమి, యష్నా ముత్తులూరి ప్రధాన పాత్రధారులుగా అఖిల్ రాజ్ తెరకెక్కిస్తోన్న ప్రేమ కథా చిత్రం 'దేవ్-పారు'. ఏకే ప్రొడక్షన్స్ బేనర్‌పై అఖిల్ రాజు దర్శకత్వంలో లోడీ ఫాహద్ అలీఖాన్ నిర్మిస్తున్నారు. శనివారం నిర్వహించిన కారక్రమంలో 'నా ప్రాణమంతా..' అంటూ సాగే ప్రేమ గీతాన్ని దర్శకుడు కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. ఈ గీతానికి ఓషో వెంకట్ స్వరాలందించగా, కాలభైరవ ఆలపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది ఒక భావోద్వేగ ప్రేమ గాథ. యువతను బాగా ఆకట్టుకుంటుంది. మిన్నాజ్ అద్భుతంగా నటించాడు' అని చెప్పారు. మిన్నాజ్ రోమి మాట్లాడుతూ ' ఈ సినిమాలో ప్రేమ కథతో పాటు భావోద్వేగ సన్నివేశాలు, హాస్యం, వినోదం వంటి అన్ని హంగులూ ఉన్నాయి' అని అన్నారు. నిర్మాత అలీఖాన్ మాట్లాడుతూ 'కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే తపన ఈ చిత్రంతో నెరవేరింది' అని పేర్కొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

గృహాల నిర్మాణానికి 5లోగా దరఖాస్తు చేసుకోవాలి

దుగ్గిరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సొంత స్థలం కలిగి గృహాలు నిర్మించుకోదలచిన వారు ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద ఇళ్లు నిర్మించుకోవచ్చని ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ పట్టా, పొజిషన్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు, భార్యాభర్త జంటగా దిగిన పాస్‌పోర్ట్ ఫోటో, ఉపాధి హామీ పథకం కార్డు తదితర పత్రాలను తీసుకుని సచివాలయంలో వచ్చే నెల 5లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కనీసం రూ.లక్ష 20వేల విలువ కలిగి 275 విస్తీర్ణం గల స్థలం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నేడు చిలువూరులో వైద్యశిబిరం

దుగ్గిరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిలువూరులో రంగిశెట్టి ఫౌండేషన్, మానవ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించనున్నారు. గ్రామంలోని రైల్వేగేటు సమీపంలో కొండపనేని రంగారావు హైస్కూల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగే శిబిరంలో ఈసీజీ, అల్ట్రాస్కానింగ్, క్యాన్సర్ సంబంధిత పాప్‌స్మియర్, సీఏ125, పీఎస్‌ఏ తదితర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించే ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు మానవసేవాసంస్థ వ్యవస్థాపకుడు సురేష్ తెలిపారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రీ-సర్వేకు సహకరించాలి

● తహసీల్దార్ వెంకటస్వామి

కాకుమాను, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ వెంకటస్వామి కోరారు. మండలపరిధిలోని బీకే పాలెంలో శనివారం రీ సర్వేపై రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతేడాది సాధారణ ఎన్నికలకు ముందు గ్రామంలో గ్రౌండ్ టూరింగ్ జరిగిందన్నారు. వీఆర్వో లాగిన్‌లో రీ-సర్వే జరుగుతుందన్నారు. రైతులు వ్యవసాయ భూములకు సంబంధించి వివరాలు తనిఖీ చేసుకోవాలన్నారు. తేడాలు ఉన్నట్లయితే భూ రికార్డులు, భూమి పట్టాలతో గ్రామ రెవెన్యూ, సర్వే అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో, విలేజ్ సర్వేయర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తుఫాన్‌ను దృష్టిలో ఉంచుకొని కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

దుగ్గిరాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో కొందరు పేకాడుతున్నారనే సమాచారంతో ఆకస్మిక దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు. పేకాట స్థావరం వద్ద లభించిన రూ2వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న వల్లభనేని వెంకట్రావు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు శనివారం అందజేశారు. 18వ వార్డుకు చెందిన చాగంటి వెంటరమణకుమారికి రూ.2,26,712ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వల్లభనేని వెంకట్రావు, అద్దంకి మురళి, భాస్కర్, బి.వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మంగళగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ.లక్షా 11 వేల 116లను విరాళంగా అందజేశారు. గుంటూరుకు చెందిన వెనిగళ్ల బాలభాస్కరరావు, పద్మలత దంపతులు విరాళం తాలూకూ పత్రాలను శనివారం దేవస్థానం ఈవో కె.సునీల్‌కుమార్‌కు అందజేశారు.

పేదలకు సొంతింటి కల సాకారం

తుళ్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంతింటి కల సాకారం చేయటానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుంది. లబ్ధిదారులను ఎంపిక చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో పీఎంఏవై అర్బన్ కింద పథకం అమలు జరిగేది. ఇప్పుడు రూరల్‌లో ఇళ్లు కట్టుకునే వారిని గుర్తించమని ఆదేశాలిచ్చారు. ఇళ్లు నిర్మాణం చేసుకునే వారు గ్రామ సచివాలయంలో సంప్రదించాలని కోరుతున్నారు. లబ్ధిదారులు మునుపెన్నడూ ఇంటి లోన్ తీసుకొని ఉండకూడదు. సొంత ఖాళీ స్థలం లేదా నూతన గృహం నిర్మించే ప్రదేశాన్ని తప్పక చూపాలి. లబ్ధిదారునికి ఉపాధి హామీ పథకం కార్డు తప్పనిసరి చేశారు. దానిని ఎంపీడీవో కార్యాయంలో జాతీయ ఉపాధి హామీ పథకం విభాగంలో పొందవచ్చు. అలాగే రాజధాని ప్రాంతంలో ఖాళీగా ఉన్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించటానికి ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గర పేర్లు నమోదు చేసుకుంటున్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఆందోళన

మంగళగిరి సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇల్లు లేని పేదలకు స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ దశల వారీగా ఆందోళనలు చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు తెలిపారు. చినకాకాని గ్రామంలో శనివారం జి.బాబూవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన మండలస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో విలీన గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పేదలకు ఇళ్లస్థలాల విషయమై అర్జీలు ఇచ్చేందుకు వెళితే అధికారులు తమకు సంబంధం లేదని తప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



పెదనందిపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో దీపారాధన చేస్తున్న భక్తులు



మంగళగిరిలో నాగేంద్ర స్వామికి పాలతో అభిషేకం చేస్తున్న భక్తులు

మంగళగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళగిరి మండలం నవులూరు గ్రామంలోని నాగేంద్ర స్వామి పుట్ట తోట భక్తులతో కిటకిటలాడింది. శనివారం వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దేవస్థానం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

● దుగ్గిరాల రైలుపేట యార్డు వెనకున్న పుట్ట, యాదవపాలెంలోని పుట్టల వద్ద మహిళలు పొంగళ్ళు సిద్ధం చేసి నాగేంద్రుడికి సమర్పించారు. చింతలపూడి-ఈమని డొంకరోడ్డులోని భానుమతివారి తోటలోగల పుట్టల వద్ద భక్తుల కోలాహలం నెలకొంది.

● పెదనందిపాడు: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగులపాడులోని స్వయంభూ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలోని పుట్ట వద్దకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా కమిటీ ఛైర్మన్ గొల్లపూడి సాంబశివరావు, సభ్యులు ఏర్పాట్లు చేశారు.

● కాకుమానులో తూర్పు చెరువుకట్ట మీద ఉన్న నాగేంద్ర స్వామికి భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అప్పాపురంలో బాపట్ల పెదనందిపాడు వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న నాగేంద్ర స్వామి పుట్ట వద్దకు భక్తులు తరలివచ్చి పాలు పోసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

17 ఏళ్లు నిండినవారు ప్రాస్పెక్టివ్ ఓటర్‌గా నమోదు కావచ్చు



ప్రసంగిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్

తాడేపల్లిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పదిహేడు సంవత్సరాలు నిండినవారు ప్రాస్పెక్టివ్ ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చని ఎంటీఎంసీ డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. శనివారం తాడేపల్లి ఎంటీఎంసీ కార్యాలయంలో ఓటింగ్ కేంద్రాలు, కొత్త కేంద్రాల సృష్టి తదితర విషయాలు చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 17సంవత్సరాలు నిండినవారు ఈసీఐ వెబ్‌సైట్‌లో గానీ ఓటర్ హెల్ప్‌లైన్‌లోగానీ ప్రాస్పెక్టివ్ ఓటర్‌గా నమోదు కావచ్చని చెప్పారు. దగ్గరలోని బీఎల్‌వోను సంప్రదించి ఫారం 6 పూర్తిచేసి కొత్త ఓటరుగా రిజిష్టరు కావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వల్లభనేని వెంకట్రావు, దారా దాసు, ఇట్టా భాస్కర్, వైసీపీ నేత బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, సీపీఐ నేతలు కంచర్ల కాశయ్య, తుడిమిల్ల వెంకటయ్య, సీపీఎం నేత డీవీ భాస్కర్‌రెడ్డి, జనసేన నేతలు అంబటి తిరుపతిరావు, దినేష్ చక్రవర్తి, కాంగ్రెస్ నేత దర్శనపు శామ్యూల్, బీజేపీ నేతలు టంకసాల ఈశ్వర్‌నాయుడు, వల్లూరు శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బాలజోజి మృతి



పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ఇన్‌సెట్లో జోజి ఫైల్‌ఫొటో

ఫిరంగిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంనకు చెందిన ఉమ్మడి గుంటూరు జిల్లా టీడీపీ బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు గోలి బాలజోజి (67) అనారోగ్యంతో శనివారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందారు. బాలజోజి రెండు పర్యాయాలు ఉమ్మడి గుంటూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా, మంగళగిరి, అద్దంకి, చిలకలూరిపేట నియోజకవర్గాల పరిశీలకులుగా, జిల్లా మేనేజరుగా ఎమ్మెల్యేలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించే రిసోర్స్ పర్సన్‌గా పని చేశారు. మృతుడి భార్య బెర్నెదమ్మ ఉపాధ్యాయురాలిగా పదవీ విరమణ చేశారు. కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పార్టీకి జోజి సేవలు ఎనలేనివి

● ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

బాల జోజి మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. జోజి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. జోజి పార్టీకి ఎన్నో రకాలుగా సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, పీఎల్ మరియన్న, పసల తోమాస్, కటికల అప్పారావు, ఆరె పున్నారెడ్డి, కొలగాని కొండలు, ఆలకుంట శివయ్య, ఎం రమేష్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ డీఎస్పీ దాసరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఏర్పాటుకు న్యాయవాదుల వినతి



చిల్లపల్లి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక న్యాయవాదుల బృందం శనివారం ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా శివరామ్‌ప్రసాద్, కార్యదర్శి కురగంటి రమేష్ మాట్లాడుతూ 2023 జనవరిలో అప్పటి ప్రభుత్వం మంగళగిరిలో అదనపు జిల్లా కోర్టు కోసం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. దాంతోపాటు మున్సిపాలిటీ నిధులు వెచ్చించి కోర్టు ఏర్పాటుకు కావలసిన సకల సదుపాయాలు సమకూర్చిందని తెలిపారు. అయితే కోర్టు సిబ్బంది నియామకాలు, కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ మాత్రం జారీ చేయలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి నారా లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లామని, జిల్లా కోర్టు ప్రారంభించడానికి త్వరతగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ మేరకు శనివారం ఏపీఎంఎస్‌ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావుకు, డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు.

మన్నె చిన నాగయ్య దాతృత్వం చిరస్మరణీయం

వట్టిచెరుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థ రాజకీయ నాయకుడిగా గ్రామాల అభివృద్ధి, తాగు, సాగు నీరు, విద్య, వైద్యంపై నిరంతరం ప్రత్యేక శ్రద్ధ చూపిన మహోన్నత వ్యక్తి మాజీ ఎమ్మెల్యే మన్నె చిన నాగయ్య చిరస్మరణీయులని ఆయన కుటుంబసభ్యులతో పాటు గ్రామానికి చెందిన పలువురు కొనియాడారు. వట్టిచెరుకూరు గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో మాజీ ఎమ్మెల్యే మన్నె చిన నాగయ్య 7వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచులు ఏదుబాటి రామచంద్రయ్య, మల్లంపాటి సాంబశివరావులు, నాగుమోతు బసవయ్య, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాదెండ్ల అప్పారావు, గ్రామస్థులు ముప్పా సాంబశివరావు, నాదెండ్ల రామచంద్రరావు, కందిమళ్ళ బాలకృష్ణ, ఆచంట రమేష్, తదితరులు ఉన్నారు. హెచ్‌ఎం, విద్యార్థులు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు పోటీ పరీక్షలు

పెదనందిపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు పోటీ పరీక్షలు ఎంతో దోహదపడతాయని ఎంఈవో జాకబ్ అన్నారు. మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా శనివారం చదవడం, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జి.అమూల్య, కె.వినయ్, పి.మొహిద్దీన్ ఆఫ్రిన్‌లను నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి : ఏడీఏ



ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ మోహన్ రావు

మేడికొండూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాను వంటి ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో పంటల నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం పొందాలంటే ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ ఎస్.మోహన్ రావు రైతులకు పిలుపునిచ్చారు. శనివారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రైతులకు, ప్రభుత్వ అధికారులకు ముఖాముఖి కార్యక్రమం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఏరియా కోఆర్డినేటర్ నిర్మల అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మోహన్‌రావు మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్‌సీ తీసుకోవాలని, వారికి కూడా అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని తెలిపారు. భూయాజమానులతో కౌలు రైతులు మాట్లాడి ఒప్పించాలని, లేదంటే వారిని తమ వద్దకు పిలిపిస్తే నచ్చజెప్పి సీసీఆర్సీ ఇస్తామన్నారు.

పెనుమాక ఎల్‌ఈ పాఠశాలకు వందేళ్లు

● సంబరాలు జరుపుకున్న అధ్యాపకులు, విద్యార్థులు



పెనుమాకలోని ఎల్‌ఈ పాఠశాల

తాడేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలోని రాజధాని గ్రామం పెనుమాకలో బ్రిటిష్ పాలనలో నిర్మించిన ఎల్‌ఈ పాఠశాల శనివారంతో వందేళ్లను పూర్తి చేసుకుంది. ఆనాడు బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ పాఠశాలలో హరిజన, గిరిజనులకు విద్యను అందించేందుకు ఏర్పాటు చేశారు. ఎల్‌ఈ పాఠశాల నేటికీ నిర్విరామంగా కొనసాగుతూ ఆదర్శ పాఠశాలగా పేరుగాంచింది. గతంలో శిథిలావస్థకు చేరడంతో 1980 ప్రాంతంలో పునర్నిర్మాణం చేశారు. అప్పట్లో 100-150 మంది విద్యార్థులతో మండలంలోనే అత్యధిక విద్యార్థులను కలిగి ఉంది. నేడు ఇద్దరు బోధకులు, 30 మంది విద్యార్థులతో పాఠశాల కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వం పట్టించుకొని ఈ పాఠశాలకు మౌలిక వసతులు కల్పిస్తే పూర్వ వైభవంతో కొనసాగే అవకాశం ఉంటుందని గ్రామస్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో పని చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ఉపాధ్యాయులు చెప్పారు.

నృసింహాలయ స్థానాచార్యుడిగా భట్టాచార్యులు



భట్టాచార్యులకు నియామకపత్రం అందజేస్తున్న ఉపకమిషనర్ శ్రీనివాస్

మంగళగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం స్థానాచార్యుడిగా నల్లూరి రామచంద్ర భట్టాచార్యులు నియమితులయ్యారు. భట్టాచార్యులు నృసింహాలయంలో ప్రధాన అర్చకుడిగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సేవలు అవసరమని భావించిన దేవదాయ ధర్మదాయశాఖ స్థానాచార్యులుగా నియమించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీనివాస్, సహాయ కమిషనర్, ఈవో సునీల్‌కుమార్ శనివారం భట్టాచార్యులకు నియామకపత్రం అందజేశారు.

మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి

● సీఐ రమా నాయక్

వట్టిచెరుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు, ఆర్థిక నేరాలతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వట్టిచెరుకూరు సీఐ రమానాయక్ సూచించారు. మండలంలోని కొర్నెపాడు గ్రామం జడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాలలో శనివారం ఆర్థిక నేరాలు, మత్తు పదార్థాల వినియోగంతో దుష్ప్రభావాలపై విద్యార్థులకు సీఐ రమానాయక్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆర్థిక నేరాలు పెచ్చు మీరిపోతున్నాయని, అలాగే మత్తు పదార్థాల వినియోగంతో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక నేరాలు, మత్తుపదార్థాల వినియోగంపై ప్రజలను చైతన్యవంతులను చేయటంలో యువత చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్, కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు సీఐ జ్ఞాపికలను, బహుమతులను అందజేశారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

ఫిరంగిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించాలని గుంటూరు సైబర్ క్రైమ్ సీఐ ఎస్‌కే నజీర్ బాషా అన్నారు. శనివారం సైబర్ క్రైమ్ వారోత్సవాల సందర్భంగా ఫిరంగిపురంలోని ఇమ్మి స్కూల్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్ళు కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వ్యక్తి గత సమాచారం, బ్యాంకుల వివరాలు, ఓటీపీలు ఇతరులకు ఇవ్వకూడదని, చెప్పారు. కార్యక్రమంలో ఫిరంగిపురం సీఐ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్

పెదనందిపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుపాన్ నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హేనాప్రియ హెచ్చరించారు. స్థానిక నల్లమడ వాగు, ప్రభుత్వ వైద్యశాల ఎదుట నివాసం ఉంటున్న ప్రజలతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. గ్రామాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉంటూ ప్రమాద ఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సహాయం కోసం 9949098619, 9640405207 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. అనంతరం నల్లమడ, నక్క వాగులను పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లా, ఆర్ఐ అబీద్‌ఆలీ, సిబ్బంది ఉన్నారు.

పంటలపై రైతులు దృష్టి సారించాలి

ఫిరంగిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో పంటలపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి జె.వాసంతి అన్నారు. వర్షాలకు పొడ తెగులు వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు ఒక లీటరు నీటికి ఒక ఎంఎల్ ప్రొఫికోనోజోల్ వాడాలన్నారు. పత్తికి పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి 20 గ్రాములు దీంతో పాటు పది గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి మూడు రోజులకొకసారి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బూర్లను కలిసిన ఏపీ ఎన్జీజీవో నాయకులు



బూర్ల రామాంజనేయులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీజీవో సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులను ప్రత్తిపాడు ఏపీఎన్జీవో సంఘ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అసోసియేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ప్రత్తిపాడు అసోసియేషన్ కార్యదర్శి జి.పాల్ ప్రసాదు, జి.నాగేశ్వరరావు, సీహెచ్. శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రగ్బీ పోటీల విజేత రాజధాని సీనియర్స్ జట్టు



ప్రసంగిస్తున్న అతిథులు

తాడేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లి అరవింద సీబీఎస్‌ఈ హైస్కూల్లో శనివారం అండర్ 18 బాలికల విభాగంలో పోటీలు నిర్వహించారు. అస్మిత ఖేలో ఇండియా ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ నేతృత్వంలో ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఫైనల్స్‌లో అమరావతి రాజధాని సీనియర్స్ జట్టు నూతక్కి రైజర్స్‌పై విజయం సాధించి ప్రథమ స్థానం పొందింది. నూతక్కి రైజర్స్ ద్వితీయ స్థానం సాధించగా, అరవింద సీబీఎస్‌ఈ స్కూల్ తృతీయ స్థానం సాధించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టి.ఆనందబాబు, ఎస్పీ కమాండెంట్ హోంగార్డ్స్, ఏపి రగ్బీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.రామాంజనేయులు, కె.సుధాకరరావు, అరవింద్ చాగంటి, స్కూల్ ప్రిన్సిపాల్ ఇంద్రాణి హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఫుట్‌బాల్ పోటీలకు జడ్పీ స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన ప్రత్తిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు

ప్రత్తిపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం షేక్ అలీ షా తెలిపారు. అండర్ 17 విభాగంలో దీపిక, పూజిత, జ్యోత్స్న, వల్లి పద్మ ఎంపికయ్యారని, అండర్ 14 విభాగంలో ఇమ్మానుయేల్ ఎంపికైనట్లు చెప్పారు. వీరిని పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అబ్బుద్ రవూఫ్‌తో పాటు హెచ్‌ఎం అలీషా, పీఈటీ కరిముల్లా ప్రత్యేకంగా అభినందించారు.

లింగవివక్షపై కేఎల్‌యూలో అవగాహన సదస్సు

తాడేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో లింగవివక్షపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్పు ట్రస్ట్ డైరెక్టర్ రావూరి సుయిజీ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర.. పురుషులు మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. లింగవివక్షను సమూలంగా నిర్మూలించాలంటే విద్యారంగం నుంచే మార్పు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ డాక్టర్ సారధివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్‌రమ్య, తదితరులు పాల్గొన్నారు.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

చేబ్రోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడి ఉన్నందున దాని ప్రభావంతో 90నుండి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఎవ్వరు ప్రయాణాలు చేయవద్దని తహసీల్దార్ శ్రీనివాస శర్మ సూచించారు. మందులు, నిత్యావసరాలు తెచ్చిపెట్టుకోవాలని, అవసరమైతేనే బయటకు రావాలని, పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరికైనా అత్యవసర పరిస్థితి ఉంటే కంట్రోల్ రూమ్‌కు నం.8500513173కు ఫోన్ చేయాలని కోరారు.

ఆధార్ సెంటర్లను తనిఖీ చేసిన ఎంపీడీవో

కొల్లిపర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నత్తనడకన ఆధార్ నమోదు... అనే ఆంధ్రజ్యోతి కథనంతో ఎంపీడీవో విజయ లక్ష్మి స్పందించారు. శనివారం మండల పరిధిలోని తూము లూరు, అత్తోట ఆధార్ అప్‌డేట్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఆధార్ అప్‌డేట్ సెంటర్లల్లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్‌లు సమయపాలన పాటించకపోయినా, ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చిన వారిని ఇబ్బందులు గురి చేసిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి నీహ

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలి

● మండల వైద్యాధికారి నీహ

కొల్లిపర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. శనివారం కొల్లిపర శివారు గుదిబండివారిపాలెంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహామేరకు మందులను వాడుకోవాలన్నారు. మెడికల్ క్యాంపుల ద్వారా దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్నవారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కల్యాణి, ఏఎన్ఎం మణిమ్మ, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు ప్రేమకుమారి, వాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ జిల్లా యువసేన నాయకుడు రవి

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

కొల్లిపర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దళితులు అందరూ నవంబరు 1వ తేదీన హైదరాబాద్‌లో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా యువసేన నాయకుడు అత్తోట రవి అన్నారు. శనివారం కొల్లిపరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టీస్‌పై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీస్ నాయకులు కొల్లిపర జయరావు, ప్రకాశరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 28న ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఉద్యమ పోస్టర్లను శనివారం ప్రకాశం రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడపోతుందని, పిపిపి నిర్వహిస్తామని చెబుతున్నారని అది ప్రైవేటీకరణ కదా అని ప్రశ్నించారు. సామాన్య విద్యార్థులకు మెడికల్ విద్యను అందుబాటులో లేకుండా చేయడమేనని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడిబోయిన రమేష్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జవహర్ బాల్ మంచ్ కో-ఆర్డినేటర్‌గా ప్రభాకర్



ప్రభాకర్

తెనాలి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా తెనాలికి చెందిన పిల్లి ప్రభాకర్ నియమితులయ్యారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు జీవీ హరి రాష్ట్రానికి చెందిన పలువురిని కో-ఆర్డినేటర్‌గా నియమిస్తూ ఈ నెల 24న ఉత్తర్వులు జారీ చేశారు. తెనాలి డివిజన్‌లో ఎన్ఎస్‌యుఐ కార్యదర్శిగా కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగంలో పని చేసిన ప్రభాకర్‌ను కో-ఆర్డినేటర్ పదవికి ఎంపిక చేయడం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

చిన్న సినిమాలకు ఎక్కువ వేతనాలు చెల్లించలేరు..

తెనాలి అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చిన్న సినిమాలలో పనిచేసే సాంకేతిక నిపుణులకు ఎక్కువ వేతనాలు నిర్మాతలు చెల్లించలేరని ఏపీ మా వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్‌రాజా చెప్పారు. రూరల్ మండలం పెదరావూరు స్టూడియోలో శనివారం అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం నిర్వహించారు. మా ఏపీ ప్రతిపాదనను పరిశీలించాలని కోరారు. చిన్న సినిమాల అవశ్యకతను గుర్తించాలని, ప్రదర్శనకు డిస్ట్రిబ్యూటర్లు ముందుకు రావాలని కోరారు. థియేటర్లు నష్టపోకుండా వినోద పన్ను మినహాయింపు, విద్యుత్ రాయితీ అంశాలు పరిశీలించాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. చిన్నసినిమాల టెక్నీషియన్లు గతంలో మాదిరిగానే వేతనాలు తీసుకోవాలని కోరారు.

కోతులతో బెంబేలు

● ఆందోళన చెందుతున్నరైతులు



కొల్లిపర కరకట్ట సమీపంలో రోడ్డుపై గుంపులు, గుంపులుగా ఉన్న కోతులు

కొల్లిపర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పంట పొలాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న కోతులతో రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధుల వెంటపడటంతో వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. అత్తలూరివారిపాలెం, మున్నంగి, వల్లభాపురం, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం, అన్నవరంగౌడపాలెం గ్రామాల్లో కోతులు ఎక్కువగా సంచరించటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటపొలాల్లోని కూరగాయలను, అరటికాయలను, బొప్పాయి పిందెలను కోతులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటపొలాల్లో కాపలా కాసినప్పటికి ఉపయోగంలేదని రైతులు తెలుపుతున్నారు. మహిళలు పొలాలకు ఒంటరిగా వెళ్ళాలంటేనే భయపడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. పగటి పూట పంటపొలాల్లో సాయంత్రానికి గ్రామాల్లోకి చేరి గృహాల్లో ఉన్న వస్తువులను పాడుచేస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. ఈ విషయాన్ని అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కోతులను పట్టించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంటయ్య

అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం

తెనాలి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం నిర్వహించారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబరం అధ్యక్షతన గాయకుడు జెల్లి గంటయ్య మాట్లాడుతూ, ఎన్నో కళారూపాలు సమాజానికి దిశా దశ మార్చాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంగీతం, సాహిత్యం, నాటకం, నాటికలు, జానపద కళారూపాలు కళారంగాన్ని ముందుకు తీసుకు వెళ్లాయన్నారు. రంగస్థలాన్ని నమ్ముకుని ఎంతో మంది కళాకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, కొందరికి ఈ రంగం అందలాన్ని ఇచ్చిందన్నారు. కన్యాశుల్కం, మృచ్ఛికవంటి మహత్తర నాటక ప్రదర్శనలు కళాకారులు అందించారని చెప్పారు. బొల్లిముంత కృష్ణ, విజయ దుర్గా, అనురాధ, సామ్రాజ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న సీఐ సాంబశివరావు

తెనాలి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ ఉత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మారీసుపేటలోని ఎస్‌సీఆర్ఎస్ఎం హైస్కూల్‌లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు శనివారం ఈ పోటీలు నిర్వహించారు. సిఐ సాంబశివరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో పోలీసుల పట్ల ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. పోలీసుల సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం పోటీల ఉద్దేశమని చెప్పారు. ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్, పోలీసులు పర్యవేక్షించారు.

మహాత్మగాంధీ ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న వెంకటేశ్వరరావు

తెనాలి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో శనివారం అన్నదానం చేశారు. అక్కిశెట్టి జయలక్ష్మి వర్ధంతి పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ పసుపులేటి బాలచందర్, వజ్రాల రామలింగాచారి, మాదల కోటేశ్వరరావు, నారాయణ శివప్రసాద్, గోపిచంద్, వెంకటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



చేబ్రోలు: పుట్టవద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొల్లిపర శివారు గుదిబండివారిపాలెంలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

తెనాలి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాగులచవితి పర్వదినాన నాగేంద్రుని పుట్టలో ఆవుపాలు పోసి పూజలు జరిపారు. కార్తీక మాసం, శనివారం కలిసి రావడంతో వైకుంఠపురం ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఈవో అనుపమ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.సాయిబాబు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి దర్శనానికి, పుట్టలో పాలు సమర్పించేందుకు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. గంగానమ్మపేటలోని పాత శివాలయం, రామలింగేశ్వరపేట శివాలయం, మారీసుపేట శివాలయం, చినరావూరు సోమేశ్వరాలయం, పెదరావూరు శివాలయంలో భక్తుల తాకిడి కనిపించింది. భక్తులు వేకువజామునే తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించారు.

పొన్నూరు మండలంలో...

పొన్నూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి వేడుకలు పొన్నూరు పట్టణం, మండలంలో శనివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. మండలంలోని కట్టెంపూడి గ్రామంలో ఉన్న శ్రీనాగేంద్ర స్వామి (పుట్ట) దేవస్థానంలో వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు పుట్ట వద్దకు పాలు పోసేందుకు బారులు తీరారు. ప్రధాన రహదారి జీబీసీ రోడ్డుపై నాగేంద్రస్వామి ఆలయం వద్ద భక్తులు కిక్కిరిసిపోయారు. మహిళలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయంలో కొలువుదీరిన స్వామి వారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ఆలయంలో నెమలి వాహనంపై ప్రతిష్ఠించి ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. పొన్నూరు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముస్లిం మహిళలు సైతం ఆలయానికి తరలివచ్చి పుట్ట వద్ద పాలు పోసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ యక్కటి పద్మారావు, ఆలయ ఈవో నాగమల్లేశ్వరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ గండు కిరణ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పొన్నూరు పట్టణం, మండలంలోని శైవాలయాల్లో నాగేదేవతలను భక్తులు దర్శించుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో నాగేంద్ర స్వామి (పుట్ట)కి మహిళలు పాలు పోసి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామి వారికి పాయసం, వడపప్పు, గుడ్లు నైవేద్యంగా సమర్పించారు.





పొన్నూరు: వెన్నపూసతో ప్రత్యేక అలంకారంలో శ్రీనాగేంద్రస్వామి మూలవిరాట్ పుట్ట వద్ద పెద్ద సంఖ్యలో పాలుపోస్తున్న భక్తులు

చేబ్రోలు మండలంలో...

చేబ్రోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినం సందర్భంగా చేబ్రోలు మండలంలోని వివిధ దేవాలయాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. చేబ్రోలులోని శ్రీ గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారికి కార్తీకదీపం వెలిగించి, పాలుపోసి, అభిషేకాలు చేశారు. వడ్లమూడి గ్రామంలోని పుట్ట వద్ద భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పాలుపోసి తమ మెక్కులను తీర్చుకున్నారు. నారాకోడూరు, సుద్ధపల్లి, వేజండ్ల, గొడవర్రు, గుండవరం, శేకూరు, శలపాడు తదితర ప్రాంతాల్లోనూ ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించడంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను మండల గ్రామాల్లో భక్తులు శనివారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కార్తీక మాసం, నాగులచవితి కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్న మహిళలు దీపారాధన చేసి పుట్ట దగ్గర ఆవుపాలు, చలిమిడి, వడపప్పు, అరటి పండు వేసి పసుపు, కుంకుమలతో పూజలు జరిపారు.

శిథిలావస్థలో వడ్లమూడి-శేకూరు వంతెనలు

● నూతన వంతెనలు నిర్మించాలని ప్రజల వేడుకోలు



వడ్లమూడి రోడ్డులోని అప్పాపురం కాలువపైన వంతెన

చేబ్రోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల నాటి వంతెనలు పాడైపోయి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలోని అప్పాపురం కాలువపై నిర్మించిన పాత వంతెన ఇప్పుడు ప్రమాదకర స్థితికి చేరింది. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ వంతెనపై ప్రతిరోజూ వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. వంతెనపై ఇరువైపులా గోడలు పాడైపోవడంతో వాహనదారులు కొద్ది పాటి నిర్లక్ష్యం వహించినా కాలువలో పడే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలతో వంతెన అంచుల వద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికే వంతెనపై పలుచోట్ల రాళ్లు ఊడిపోయి శిధిలావస్థకు చేరింది. శేకూరు వెళ్లే దారిలో ఉన్న వంతెన కూడా అదే స్థాయిలో శిథిలమవుతోంది. నిత్యం గుంటూరు, తెనాలి వైపునకు చిన్న, పెద్ద వాహనాలు ఈ వంతెన మీదుగా ప్రయాణం చేస్తున్నాయి. వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో వంతెనపైనే నిలబడిపోతున్నాయి. పిట్టగోడలు అక్కడక్కడ కూలిపోవడం, ఇనుప చువ్వలు బయట పడి తుప్పుపట్టిపోయాయి. ఈ వంతెనలపై రోజూ పాఠశాలలకు, మార్కెట్లకు విద్యార్థులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. శిధిలమైన ఈ వంతెనల స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాలప్రజలు కోరుతున్నారు.



శేకూరు రోడ్డులోని నల్ల డ్రెయిన్ పై వంతెన



రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక

రూ.57.20 లక్షలతో రహదారుల నిర్మాణం

తెనాలి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.57.20 లక్షలతో నిర్మించనున్న రహదారులకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శంకుస్థాపన చేశారు. 5, 6, 8, 10 వార్డులలో ఐదు రోడ్లు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పట్టణంలో అన్ని రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి, కమిషనర్ అప్పలనాయుడు, డీఈ శ్రీనివాసులు, ఎంఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాక గౌరవాన్ని కాపాడాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న పారా లీగల్ వలంటీర్ ముజీర్

పొన్నూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పౌరులు ప్రతి ఒక్కరు జాతీయ పతాక గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని పారా లీగల్ వలంటీర్ షేక్ ముజీర్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శనివారం మండల న్యాయ సేవా కేంద్రం చైర్మన్, మెజిస్ట్రేట్ జీ రుక్మిణి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా, నేషనల్ హానర్ యాక్ట్ చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఉపయోగించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. జాతీయ జెండాను ఉపయోగించటం, అవనతం చేయడం గురించి అవగాహన కల్పించారు. ఈ సదస్సులో విద్యార్థులు, కళాశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్ హక్

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ

పొన్నూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం రేషనలైజేషన్‌కు సంబంధించిన ప్రపోజల్స్‌ను కోరినట్లు తెలిపారు. మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో 156, 157 పోలింగ్ స్టేషన్ల పరిధిలో గతంలో ఎంపీపీ స్కూల్ ఉండేదని ప్రస్తుతం జడ్పీ హైస్కూల్‌గా మార్పు చేసినందున పోలింగ్ కేంద్రం పేరు మార్పునకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పెదకాకాని మండలంలో 38, 41, 48 పోలింగ్ కేంద్రాలలో 1200 పైబడి ఓటర్లు ఉన్నందున వాటికి అదనంగా మరో మూడు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రపోజల్ పంపినట్లు చెప్పారు. చేబ్రోలు మండలంలోని 98, 106 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 1200 పైబడి ఓటర్లు ఉండటంతో మరో రెండు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు చెప్పారు. అర్బన్ పరిధిలో 177, 178, 180, 183, 185, 186, 213, 221 పోలింగ్ కేంద్రాలలో 1200 పైబడి ఓటర్లు ఉన్నందున అదనంగా 8 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రపోజల్స్ పంపినట్లు చెప్పారు. మండల పరిధిలోని వెల్లలూరులో 152, 153 జడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీపీ పాఠశాలకు మార్చేందుకు అర్జీ వచ్చినట్లు చెప్పారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చేబ్రోలు పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు

చేబ్రోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 16 వాహనాలపై కేసులు నమోదు చేసారు. మరో 8 వాహనాలను మైనర్లు నడుపుతున్నందున వాటిని సీజ్ చేశారు. మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీల్లో సీఐ కోటేశ్వరరావు, ఎస్సై వీరనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.